ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 3 జూలై 2024 | 5



అభివృద్ధి జరగాలి : కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పవన్..పవర్

4 గంటల పాటు ఏకధాటిగా సాగిన సమీక్షలు

- అన్ని వ్యవస్థలను గాడిలో పెడతాం
- ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల ఇసుక రాబడి
- స్థానిక సంస్థలకు ఇసుక సీనరేజీ ఎగవేత
- పంచాయతీ నిధులు మింగేసిన జగన్
- జలజీవన్ మిషన్ నిధులతో గ్రామాలకు నీళ్లు
- హోప్‌ఐలాండ్ ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి
- ఉప్పాడ సముద్ర కోత పరిశీలనకు నేడు నిపుణులు
- కాకినాడ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కాకినాడ (కలెక్టరేట్), జూలై 2: కేంద్రం ఇస్తున్న జలజీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ చెప్పారు. జనావాసాల్లో ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ శాఖ, పర్యావరణశాఖలపై అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నాలుగు గంటల పాటు జరిగిన సమీక్షలో అన్ని అంశాలపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్ల ఇసుక వ్యాపారం జరిగింది. ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల రాబడి వచ్చినా జగన్ ప్రభుత్వం మాత్రం పంచాయతీల నిధులకు గండి కొట్టింది. గనుల సీనరేజీ నిధులు సైతం ఇవ్వకుండా దారి మళ్లించారు. వీటన్నింటిపై అధికారులను నివేదిక కోరినట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుకుని పంచాయ తీలకు చిల్లిగవ్వ కూడా పన్ను చెల్లించలేదన్నారు. ఈ పరిస్థితిని మార్చి ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చేస్తామన్నారు. కాకినా డకు అతి సమీపంలో ఉన్న కోరంగి మడ అడవులను గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో ధ్వంసం చేసింది. వేల టన్నుల కంకరతో మడ భూములను చదునుచేసింది. దీనివల్ల మడ అడవుల్లో ఉండే జీవరాశులు మనుగడ కోల్పోయే ప్రమాదం వాటిల్లిందన్నారు. తిరిగి మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు చెప్పారు. కోరంగిలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామ న్నారు.ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న హోప్ ఐలాండ్‌ను సంరక్షిస్తామని, అక్క డున్న జీవులను కాపాడేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కాకినాడ స్మార్ట్ సిటీకి సంబంధించి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనుల విషయంపై ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కేంద్రంతో మాట్లాడతారని తెలిపారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. సముద్రతీరాన్ని రక్షించే మడ అడవులను వైసీపీ పాలనలో నాశనం చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. హానికరమైన మలేషియన్ బ్రీడ్ రకం కోనో కార్పస్ మొక్కలను పచ్చదనం కోసం పెంచారని, వాటిని దశలవారీగా తొలగిస్తామని చెప్పారు. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోత వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, దాని పరిశీలనకు తాను బుధవారం వెళ్లనున్నట్టు తెలిపారు. చెన్నైకు చెందిన నిపుణుల బృందం పరిశీలనకు వస్తున్నట్టు చెప్పారు. వనాలు, జీవజాతుల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. వ్యవస్థలను అన్నింటినీ గాడిలో పెడతామని తెలిపారు. సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, జేసీ రామసుందరరెడ్డి, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎస్పీ సతీష్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉప్పాడ తీరం ధ్వంసం కాకుండా చర్యలు

ఉప్పాడ తీరంలో ఏడాదిన్నర కాలంగా ఎకరం భూభాగం సముద్రపు కోతలో కలిసిపోయిందని. ఇలా ధ్వంసం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉప్పాడ తీరాన్ని పరిశీలించి దాన్ని రక్షణకు అవసరమైన చర్యలు సూచిస్తుందన్నారు. తద్వారా తీర సంరక్షణ చేపడుతున్నట్టు చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేరళలో అధ్యయనం చేసిన తర్వాత కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైన్సు అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే నన్నయ్య యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్లను తీసుకెళ్లి ఉప్పాడ తీర సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తామని చెప్పారు.



అధికారులతో సమీక్షిస్తున్న పవన్ కల్యాణ్ చిత్రంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు నెహ్రూ,కొండబాబు, నానాజీ, సత్యప్రభ

నేడు పిఠాపురంలో పవన్ వారాహి సభ

పిఠాపురం/ఉప్పాడ, జూలై 2: పవన్‌కల్యాణ్ మూడో రోజు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకోనున్నారు. ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాలను పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడతారు. అక్కడ నుంచి 12 గంటలకు బయలుదేరి చేబ్రోలు నివాసానికి 12.45 గంటలకు చేరుకుంటారు. చేబ్రోలు నివాసంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన అన్ని శాఖల అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, బీజేపీ ముఖ్య నేతలను కలుసుకుంటారు.భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే వారాహి బహిరంగ సభలో పాల్గొని తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రసంగిస్తారు. సభ అనంతరం సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి విజయవాడ వెళతారు.

పనులపై నివేదిక ఇవ్వండి

పంచాయతీరాజ్‌పై సమీక్ష సందర్భంగా జిల్లా, మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల గురించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తి వివరించారు. దీనిపై పవన్ స్పందిస్తూ ఈ పనులు జిల్లా అంతటా జరిగాయా, లేక కొన్ని మండలాల్లోనే జరిగాయా అన్న విషయంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో 1 జడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉందని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ తెలిపారు. జిల్లాలోని మునిసిపాలిటీల్లో విలీనానికి ప్రతిపాదించిన 10 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగలేదని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలోని 32 మండలాలకు నీరందించేందుకు రూ.1650 కోట్లతో జలజీవన్‌మిషన్ కింద ప్రతిపాదించిన వాటర్‌గ్రిడ్ పథకం హెడ్‌వర్క్స్‌కు అవసరమైన 14 ఎకరాల భూసేకరణ పూర్తికాక పనులు ముందుకు సాగలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ తెలిపారు. పిఠాపురం-రాపర్తి మధ్య హైవే పనుల వల్ల సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌కు చెందిన పైపులైన్లు దెబ్బతినడంతో 17 ఆవాస ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఈ వివరించారు. నాగులాపల్లి స్కీమ్ ఇబ్బందులను తెలియజేశారు.

కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు

కాలుష్యంతో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాలుష్య నివారణ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ సంస్థపై తీసుకున్న చర్యలను తెలియజేయాలని పీసీబీ ఈఈ సందీప్‌రెడ్డిని ఆదేశించారు. శాస్త్ర సాంకేతిక శాఖకు సంబంధించి రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేస్తున్న కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల్లో సాంకేతికపై ఆసక్తి కలిగేలా కేంద్రాన్ని తీర్చిదిద్దాలన్నారు.

పర్యాటక ప్రాజెక్టును కోరాం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాకు ప్రసాద్ పథకం కింద పర్యాటక ప్రాజెక్టు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏర్పాటుకు ప్రధానమంత్రి మోదీని కోరామని తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మాట్లాడుతూ ఆగిపోయిన స్మార్ట్‌సిటీ పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గతంలో ఏటిమొగ వద్ద ఉప్పుటేరుపై శంకుస్థాపన చేసిన బ్రిడ్జి పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు.

మా గుర్తుగా..



పవన్‌ను సత్కరించి ఫొటోలతో కూడిన జ్ఞాపికను అందజేస్తున్న చేబ్రోలులో పవన్ నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరావు కుటుంబసభ్యులు





అక్రమ భవన నిర్మాణం వద్ద మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన అనుచరుల హల్‌చల్

హైడ్రామా

- వార్త 7లో

ద్వారంపూడి హల్‌చల్

- అక్రమ నిర్మాణం వద్ద మాజీ ఎమ్మెల్యే వీరంగం
- తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన టీడీపీ, జనసేన నాయకులు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై2: కాకినాడ నగర పరిధిలోని గొడారిగుంటలో అక్రమ కట్టడాన్ని నిలువరించే అధికారులను అడ్డుకుని దాడికి పాల్పడిన మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తీరుపై అధికార పక్ష నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ కార్యకర్త, ద్వారంపూడి అనుచరుడు ఒకరు మొదటి ఫ్లోర్ వరకు కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకుని రెండో ఫ్లోర్ కూడా నిర్మించడంతో అధికారులు నోటీసులు జారీచేసి చివరకు వాటిని తొలగించే పని మంగళవారం చేపట్టారు. అక్కడకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, ఆయన అనుచరులు కొద్దిసేపు వీరంగం చేశారు. పోలీసులపై సైతం విరుచుకుపడ్డారు. తొలగింపు పనికొచ్చిన కూలీలపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై టీడీపీ, జనసేన శ్రేణులు ధ్వజమెత్తారు. పదవి కోల్పోయిన చంద్రశేఖర్‌రెడ్డి ఇంకా అక్రమ దందాలు కొనసాగించాలని ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు.

ముందుంది ముసళ్ల పండుగ

ఎదురొస్తే బెదిరించడం, ఖాళీగా కనిపిస్తే ఆక్రమించడం, అక్రమార్కులకు అండగా అండగా నిలబడడం.. గడచిన అయిదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతలు సాగించిన దందాలను ఎవరూ మర్చిపోలేదు. ఇలాంటి వ్యవహారాల్లో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆరితేరినట్టు ఎన్నో ఉదాహరణలు ఉండేవి. ద్వారంపూడి అక్రమాలకు ప్రజలు తమ ఓట్లతో చెక్ పెట్టారు. అయినప్పటికీ తానొక మాజీ ఎమ్మెల్యేను అనేమాట మరచి అధికార దందా సాగించాలని మంగళవారం ప్రయత్నించి భంగపడ్డారు. అటు అధికారులు, ఇటు పోలీసులు హెచ్చరిక ధోరణిలో సమాధానం ఇవ్వడంతో అక్కడ నుంచి నిష్క్రమించారు. ద్వారంపూడి నేతృత్వంలో చేసిన బియ్యం కుంభకోణాలను వెలుగులోకి తీసుకొచ్చే పనిలో ప్రస్తుత ప్రభుత్వం ఉంది. మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవలే ద్వారంపూడి దందాలను బయటపెట్టే పని మొదలుపెట్టామని చెప్పి వెళ్లారు. ఆమేరకు అక్రమ బియ్యం నిల్వలపై దాడులు మొదలయ్యాయి. మరోవైపు నగరంలో చంద్రశేఖర్ రెడ్డి, ఆయన అనుచరులు ఎన్నో భూదందాలకు పాల్పడ్డారు. అవన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అలాగే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అలాంటి అక్రమ నిర్మాణం ఒకటి గొడారిగుంటలో చేపడితే, దాన్ని నిలువరించే ప్రయత్నంలో ఉన్న అధికారులపై చంద్రశేఖర్‌రెడ్డి నేరుగా వెళ్లి బెదిరించి దాడికి పాల్పడ్డారు. దీంతో ఉన్నతాధికారులు రంగప్రవేశం చేసి అది అక్రమ కట్టడమేనని తేల్చిచెప్పడంతోపాటు దాడి విషయం పెద్దది కావడంతో చంద్రశేఖర్‌రెడ్డి మెల్లగా అక్కడ నుంచి జారుకున్నారు. నిజానికి ఇలాంటి అక్రమ నిర్మాణాలు చంద్రశేఖర్‌రెడ్డి హయాంలో గడిచిన ఐదేళ్లలో విచ్చలవిడిగా జరిగాయి. దీనిపై ప్రస్తుత అధికార పక్షం ఉక్కుపాదం మోపింది. ఇప్పటికే అనేక అవినీతి, అక్రమాలు బయటకి వస్తున్నాయి. గతంలో చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా అధికారంలో ఉన్నప్పుడు జర్నలిస్టులపై కూడా దాడులు చేస్తానని నేరుగా హెచ్చరికలు జారీచేశారు. అదేవిధంగా తన అక్రమ దందాలకు అడ్డొచ్చిన ప్రతీ ఒక్కరినీ బెదిరింపులతో పక్కకు తప్పించారు. అధికారులను మభ్యపెట్టి అవసరమైతే బెదిరించి అక్రమదందాలకు అడ్డు లేకుండా ముందుకు సాగారు. దీంతోపాటు చంద్రశేఖర్‌రెడ్డి అనుచరులు ఆగడాలకు అడ్డేలేకుండాపోయింది. అయిదేళ్లపాటు వారంతా ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు. గతంలో పవన్‌కల్యాణ్‌ను తిట్టడం, వీరమహిళలపై దాడులు చేయించడంతో పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా పవన్ ఉండడంతో చంద్రశేఖర్‌రెడ్డి అరాచకాలు బయటపడుతున్నాయి. యంత్రాంగమంతా ద్వారంపూడి అక్రమ దందాలను బయటకులాగే పనిలో ఉండడంతో ముందుంది ముసళ్ల పండగలా కనిపిస్తోంది.


మాజీ ఎమ్మెల్యే అక్రమాలకు అడ్డులేకుండాపోయింది



మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అక్రమాలకు అడ్డులేకుండా పోయిందని టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటి అక్రమాలు ఇప్పుడు బయటపడుతున్నాయన్నారు. గొడారిగుంటలో బయటపడిన అక్రమ కట్టడం ఒక మచ్చుతునక మాత్రమేనని తెలిపారు. ఇలాంటివి ఎన్నో అక్రమాలకు చంద్రశేఖర్‌రెడ్డి అనుచరులు కాకినాడ నగరంలో పాల్పడ్డారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా చంద్రశేఖర్ రెడ్డి అనుచరగణం చేసిన అక్రమాలన్నీ వెలుగులోకి వస్తాయని వివరించారు. గుడారిగుంటలో అక్రమ కట్టడాలను కూల్చివేసిన అధికారులను ఆయన అభినందించారు.

- మల్లిపూడి వీరు, టీడీపీ నగర అధ్యక్షుడు

మరిన్ని అక్రమ కట్టడాలు బయటకొస్తాయి..



కాకినాడ మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి ఇంకా అధికారంలో ఉన్నానని అనుకుంటున్నారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్ ఎద్దేవా చేశారు. గొడారిగుంటలో చంద్రశేఖర్‌రెడ్డి చేసిన అక్రమాలను బయటకు తీస్తున్న అధికారులపై దాడికి పాల్పడడం ఆయన దాష్టీకాలకు ఒక నిదర్శనమన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని ప్రజలు తిరస్కరించారన్న విషయం మరిచిపోయి తన అక్రమాలను కొనసాగించాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరిన్ని అక్రమ కట్టడాలు వివరాలు బయటపడతాయని తెలిపారు.

- సంగిశెట్టి అశోక్, జనసేన రాష్ట్ర కార్యదర్శి

నిబంధనలు మరిచిపోయి ప్రవర్తిస్తున్నారు



మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి నిబంధనలు మరిచిపోయి ప్రవర్తిస్తున్నారని బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ విమర్శించారు. ప్రభుత్వం కొన్ని చట్టాలను రూపొందిస్తుందని, దానికి అనుగుణంగా అధికారులు నడుచుకుంటారని వివరించారు. చట్టాలన్నీ ప్రజలకు మేలు చేసేవిధంగా ఉంటాయన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి అక్రమ కట్టడాలను ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనైనా చంద్రశేఖర్‌రెడ్డి చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నేతగా ఉందని హితవు పలికారు.

- గట్టి సత్యనారాయణ, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్

అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్త కలెక్టర్‌గా మహేష్‌కుమార్



అమలాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్ సెక్రటరీగా పని చేసిన ఆయన్ను కలెక్టర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుత కలెక్టర్ హిమాన్షుశుక్లాను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. గతంలో ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు.

కాల్వలకు నీటి విడుదల ఎప్పుడో..





గోదావరి జలాలు రాక పీబీసీ కాలువలో అడుగంటిన నీరు.. పిఠాపురం వద్ద ఏలేరు కాల్వలో పేరుకున్న గుర్రపుడెక్క

- ప్రశ్నార్థకంగా ఖరీఫ్ సాగు
- ఏలేరు, పీబీసీ ఆయకట్టులో అయోమయ పరిస్థితి
- ఏలేరు రిజర్వాయర్‌లో డెడ్‌స్టోరేజీకి దిగువనే నీటి నిల్వలు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యమే నేడు రైతులకు శాపం

పిఠాపురం, జూలై 2: జూలై మొదటి వారం వచ్చేసింది. ఏలేరు, పీబీసీ కాల్వలకు ఇంకా సాగునీరు విడుదల కాలేదు. అసలు నీరు ఇస్తారో లేదో తెలియని అయోమయ పరిస్థితి. గత ఐదేళ్లుగా పంటకాల్వల నిర్వహణపై నాటి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం నేడు రైతులకు శాపంగా పరిణమించింది. పిఠాపురం నియోజకవర్గంతోపాటు పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని, కాకినాడ రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఏలేరు రిజర్వాయర్ ద్వారా అందే నీటితో 67 వేల ఎకరాలు, పీబీసీ (పిఠాపురం బ్రాంచి కెనాల్) ద్వారా అందే గోదావరి జలాలతో 42,700 ఎకరాలు సాగవుతాయి. ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడం, రబీలో శివారు ప్రాంతాలను మినహాయించి సాగునీటిని సరఫరా చేయడం రెండు దశాబ్దాలుగా జరుగుతోంది. ఏలేరు రిజర్వాయర్‌లో నీరు పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు దాని ఆయకట్టు సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు పీబీసీ, పంపా ఆయకట్టుకు ఏలేరు జలాలు వినియోగించేవారు. అటు ఇటూ సర్దుబాటు ద్వారా సాగునీటికి ఇబ్బంది లేకుండా రైతులు రెండు పంటలు పండించుకునే వీలుండేది. ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తరచూ కనిష్టస్థాయికి పడిపోయి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గోదావరి నీటిని ఏలేరు ఆయకట్టుకు మళ్లించి రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందించాలని 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించింది. రూ.1650 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. గోదావరి జలాలను ఈ పథకం ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు మళ్లించి ఏలేరు ఆయకట్టుతోపాటు పీబీసీ, పంపా ఆయకట్టుకు సాగునీరు అందించడం, విశాఖ స్టీల్ ప్లాంటు, అక్కడ పారిశ్రామిక అవసరాలకు నీటిని ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందించగలిగేవారు. 2019 వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు, కరెంటు చార్జీలు భరించేందుకు నాటి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో పథకం నిరుపయోగంగా మారింది. దీంతో ఏలేరు రిజర్వాయర్‌లో నీటినిల్వలు అడుగంటడం మొదలైంది. గత సార్వా దాళ్వా సీజన్ల సమయాల్లో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారు. అటు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినా ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం ఏ మాత్రం పెరగకపోగా తగ్గిపోతుండడం ప్రస్తుతం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌లో గరిష్ఠంగా 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. ఇందులో 6 టీఎంసీలను డెడ్‌స్టోరేజీగా పరిగణిస్తారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం మంగళవారం 68.50 మీటర్లుండగా, 3.57 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నెలరోజుల కిందట ఏలేరు నీటిమట్టం 68.71 మీటర్లుండగా 3.68 టీఎంసీల నీరుండేది. అంటే నెల రోజులతో పోల్చుకుంటే తగ్గిపోయింది. దాళ్వా సీజన్‌కుగానూ డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని వాడడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం డెడ్‌స్టోరేజీ నుంచి మోటార్ల ద్వారా 80 క్యూసెక్కుల నీటినితోడి విశాఖ స్టీల్‌ప్లాంటుకు తరలిస్తున్నారు. డెడ్‌స్టోరేజీకంటే అధికంగా ఉంటే స్టీలుప్లాంటుకు కాల్వల ద్వారా సాధారణ స్థితిలోనే నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేక మోటార్లు వినియోగించాల్సి వస్తోంది. ఇన్‌ఫ్లోస్ ప్రస్తుతం 2,500 క్యూసెక్కులు ఉండడం కొంత ఊరట కలిగిస్తోంది. ఇప్పుడు ఖరీఫ్ సీజన్‌లో మొదటి పంటగా వరిసాగు చేయాలంటే కనీసం 8.50 టీఎంసీల నీరు అందుబాటులో ఉండాలి. విశాఖ అవసరాలకు మరో 2 టీఎంసీల వరకూ నీరు అవసరమవుతుంది. వీటిని పరిగణలోకి తీసుకుంటే మొత్తం 10 టీఎంసీల వరకూ నీరు అవసరం. ఇది జరగాలంటే క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీవర్షాలు కురిసి ఇన్‌ఫ్లోస్ పెరిగితే నీటిమట్టం పెరుగుతుంది. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడినా ఇన్‌ఫ్లోస్ లేకపోవడంతో నీటినిల్వలు ఇంకా తగ్గుతున్నాయి.

పీబీసీలో ఏమిటి పరిస్థితి

గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల చేసినప్పటికి పీబీసీ కాల్వలకు మాత్రం ఇప్పటివరకూ గోదావరి జలాలను విడుదల చేయలేదు. సామర్లకోట సమీపంలోని రెగ్యులేటర్ వద్ద గల అడ్డంకుల కారణంగా సాగునీటిని విడుదల చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా పీబీసీ కాల్వలకు జూన్ 1 నుంచి 15వ తేదీ మధ్యలో నీటిని విడుదల చేస్తారు. ఈ ఏడాది మాత్రం జూలై మొదటివారం వచ్చినా ఇంకా సాగునీరు కాల్వలకు ఎప్పుడు చేరుతుందో అధికార యంత్రాంగం చెప్పలేకపోతోంది. మరోవైపు పీబీసీ కాలువల్లో పూడికలు, గుర్రపుడెక్క పేరుకుపోయాయి. కళింగల్స్, స్లూయిజ్‌లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. గొల్లప్రోలు, తొండంగి మండలాల్లో 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే ఆర్‌ఆర్‌బీ చెరువు సరఫరా వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైంది. ఐదేళ్లుగా కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటిసరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏలేరు పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది.



ఏలేరు, పీబీసీ ఆయకట్టు పొలాలు ఖాళీగా ఉన్న దృశ్యం

అసలు విడుదల చేస్తారా.. లేదా?

ఇప్పుడు రైతులందరిలోనూ ఏలేరు, పీబీసీ కాల్వలకు సాగునీరు విడుదల చేస్తారా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అత్యంత కనిష్ఠస్థాయికి పడిపోవడం, పీబీసీ నీటి విడుదలపై అధికారులు ఏమి తేల్చిచెప్పకపోవడంతో మొదటి పంటకు వరి వేసుకోగలమా లేదా అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో రైతులు కనీసం పొలాలను దుక్కుదున్నకుండా వదిలేశారు. ఫలితంగా ఏలేరు, పీబీసీ ఆయకట్టు పొలాలు బీడులుగా దర్శనమిస్తున్నాయి.

మరేం చేయాలి..

ఏలేరు రిజర్వాయర్‌లో నెలకొన్న పరిస్థితుల్లో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చి ఏలేరుకు మళ్లించడం ఒక్కటే మార్గంగా ఉంది. కనీసం 15 టీఎంసీల గోదావరి జలాలను రిజర్వాయర్‌లోకి మళ్లిస్తే ఖరీఫ్‌కు అవసరమైన సాగునీటితోపాటు విశాఖ స్టీల్‌ప్లాంటు అవసరాలు తీరతాయి. ఒకవేళ ఈ ఎత్తిపోతల పథకం ప్రారంభించేందుకు సాంకేతిక ఇబ్బందులుంటే పుష్కర ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుని ఏలేరు కాల్వలకు గోదావరి జలాలను మళ్లించాలని రైతు సంఘాల ప్రతినిధులు, విశ్రాంత ఇరిగేషన్ ఇంజనీర్లు సూచిస్తున్నారు. ఈలోగా ఏలేరు రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీ నుంచి నీటి వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని కాల్వలకు నీరు ఇస్తే రైతులు నారుమడులు, పంటలు వేసుకునే ఏర్పడుతుందని వారు చెబుతున్నారు. అదే సమయంలో పీబీసీకి సాగునీటి విడుదలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే సార్వా సాగు ఆలస్యమై పంట దిగుబడి వచ్చే సమయానికి తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాల బారినపడి నష్టపోయే ప్రమాదముందని చెబుతున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తోపాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టిపెట్టి ఏలేరు, పీబీసీ కాల్వలకు సాగునీటి విడుదల ద్వారా తక్షణం నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది.



సూర్యోదయం ఎంతో ఆహ్లాదకరం

గోదావరి తీరంలో సూర్యోదయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అదే మబ్బులు వేసిన సమయంలో మరింత అందాలు కనువిందు చేస్తాయి. ఇదేవిధంగా మంగళవారం ఉదయం పెరవలి మండలం తీపర్రువద్ద గోదావరి తీరానికి వెళ్లిన పలువురికి ఈ సూర్యోదయం ఎంతో ఆహ్లాదకర అనుభవాన్ని ఇచ్చింది.

-పెరవలి

15 వరకు భీమేశ్వరాలయంలో సంరక్షణ పనులు

ద్రాక్షారామ, జూలై 2: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మూలవిరాట్ సంరక్షణ పనులు ఈనెల 15వరకు కొనసాగనున్నాయి. ఈమేరకు పురావస్తుశాఖ అధికారులు ఈవో పి.టి.వి.సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. దీంతో భీమేశ్వరుడి మూల విరాట్, మాణిక్యాంబ అమ్మవార్లదర్శనం మరో కొన్నిరోజులు పట్టే అవకాశం ఉందని ఈవో తెలిపారు.

రేపటి నుంచి ఏపీఈఏపీసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- ఈనెల 7వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- 8నుంచి 12వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
- కాకినాడలో రెండు సహాయ కేంద్రాలు

జేఎన్టీయూకే, జూలై2: ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈనెల 4నుంచి జరుగనుంది. ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీచేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆదివారం జారీ చేశారు. ఈనెల 7వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుచేసుకోవచ్చని కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే సహాయకేంద్రం సమన్వయకర్త ప్రొఫెసర్ ఎన్.బాలాజీ తెలిపారు.

● ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 2 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలుండగా జేఎన్టీయూకేలోని యూసీఈకే, రాజానగరంలో గల అక్నూలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో 950 సీట్లు, 32 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 15,400 సీట్లు మొత్తం 16,350 సీట్లున్నాయి. ఏపీఈఏపీసెట్‌లో ఇంజనీరింగ్‌కు 14,250 మంది, ఫార్మసీకి 6,757 మంది అర్హత సాధించారు.

సందేశాల నివృత్తికోసం

●అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే జిల్లాలోని కాకినాడ జగన్నాధపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయకేంద్రంలోగానీ, కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకేలో ఏర్పాటుచేసిన సహాయకేంద్రంలో కానీ సంప్రదించాలి. అంతేకాకుండా 7995681678, 7995865456, 9177927677 హెల్ప్‌డెస్క్ నెంబర్లకు ఫోన్‌చేయవచ్చు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తోంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్‌చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్‌వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్‌టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణపత్రం ఉన్న వారికి 2022నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతీ ఏడాది అమలుచేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

● ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపు, రిజిస్ట్రేషన్	: ఈనెల 7 వరకూ.
● ధ్రువపత్రాల పరిశీలన	: ఈనెల 4నుంచి 10వరకూ
● వెబ్ ఆప్షన్ల నమోదు	: ఈనెల 8నుంచి 12వరకూ
● ఆప్షన్ల మార్పు	: ఈనెల 13న
● సీట్ల కేటాయింపు	: ఈనెల 16న
● కళాశాలల్లో రిపోర్టింగ్	: ఈనెల 17నుంచి 22 వరకూ.
● తరగతుల ప్రారంభం	: ఈనెల 19 నుంచి

● విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి :
ర్యాంకు కార్డు, మార్కులజాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి.

● పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్, స్పోర్ట్స్, గేమ్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీ అభ్యర్థులకు మాత్రం ఈనెల 6 నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు.

రూ.40 లక్షలు గోల్‌మాల్!

- జి.ఎర్రంపాలెంలోని బరోడా బ్యాంక్‌లో ఘటన
- చెల్లింపులు, రికార్డుల్లోని వివరాల్లో తేడాలు
- బ్యాంకులో బీసీ పాయింట్ వ్యక్తిపై అనుమానాలు





స్వయంసహాయక సంఘానికి ఇచ్చిన రశీదు, వివరాలను తెలియజేస్తున్న డ్వాక్రా మహిళలు

దివాన్‌చెరువు, జూలై 2: తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలంలోని జి.ఎర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో దాదాపు రూ.40లక్షలు మేర సొమ్ము గోల్‌మాల్ జరిగినట్టు తెలుస్తోంది. బ్యాంకులో బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి ఈ అవకతవకలకు పాల్పడినట్టు కొంతమంది ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి వివరణ ఇచ్చేందుకు బ్యాంకు బ్రాంచి మేనేజర్ నిరాకరించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని కొందరికి ఫోన్లు వెళ్లడం, కొన్ని స్వయం సహాయక సంఘాలు చెల్లించిన సొమ్ముకు, బ్యాంకు రికార్డుల్లో నమోదైన సొమ్ములో తేడాలుండడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఖాతాదారుల సౌకర్యార్థం ఒక వ్యక్తిని తమ ప్రతినిధిగా బ్యాంకు నియమించుకుంది. ఖాతాదారులకు బ్యాంకు వెలుపల ఆ వ్యక్తి అందుబాటులో ఉండి సేవలందించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా జి.ఎర్రంపాలెంలోని బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి బ్యాంకు ఆవరణలోనే ఉంటూ డ్వాక్రా సంఘాలు, రైతులు బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్ములో కొంత తానే కట్టించుకుని రశీదులు ఇచ్చేవారని కొంతమంది డ్వాక్రాసంఘాల సభ్యులు తెలిపారు. దీంతో వారంతా బ్యాంకు ప్రతినిధులే అయి ఉంటారని తాము అనుకున్నామన్నారు. ఆ గ్రామంలోని మేరీమాత స్వయం సహాయక సంఘానికి చెందిన కోనె లక్ష్మిని విలేకరులు ఈ విషయమై ప్రశ్నించగా ఐదు నెలలుగా తాము చెల్లించిన రూ1.20 లక్షలు సొమ్ము తేడా వచ్చిందన్నారు. తాము బ్యాంకులో చెల్లించిన సొమ్ము బాగానే ఉందని, బ్యాంకు ప్రతినిధి నానిబాబు అనే వ్యక్తికి చెల్లించిన సొమ్ములోనే ఈ వ్యత్యాసం వచ్చిందన్నారు. బ్యాంకుకు తాము వచ్చినపుడు రూ.10 వేలలోపు సొమ్మును తమ బ్యాంకు ప్రతినిధికి చెల్లించాల్సిందిగా కొంతమంది బ్యాంకు సిబ్బందే తమకు చెప్పేవారన్నారు. సుజాత గ్రూపునకు చెందిన దమ్ము దుర్గ మాట్లాడుతూ తమ సంఘానికి సంబంధించి రూ.20వేలు తేడా వచ్చాయన్నారు. శారదా గ్రూపునకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పోశమ్మ, యజ్ఞ కళ్యాణి మాట్లాడుతూ తమ సంఘం పొదుపు సొమ్ము బ్యాంకుకు రూ.92 వేలు చెల్లిస్తే తమ ఖాతాలో ఏడు వేలు మాత్రమే కనబడుతోందని చెప్పారు. రెండు సంవత్సరాల క్రితం తమకు రూ.60 వేలు రుణం వచ్చిందని, అప్పటి నుంచీ తమ ఖాతాలో పొదుపు సొమ్ములేదని గుర్తించామన్నారు. ఈ విషయమై యానిమేటర్‌ను అడగగా అప్పులు ఆలస్యంగా చెల్లించిన వారికి పొదుపు సొమ్ము అప్పుకు జమచేసి ఉండవచ్చని తెలిపారన్నారు. తాము ఈ లోపాలను గుర్తించి కొంతకాలంగా బ్యాంకు చుట్టూ తిరుగుతుంటే నాలుగు రోజుల్లో చెబుతామని సిబ్బంది అన్నారన్నారు. సత్యసాయి స్వయం సహాయక సంఘానికి సంబంధించి రూ.60 వేల వరకూ తేడా వచ్చినట్టు తెలిసింది. జి.ఎర్రంపాలెం, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాల్లోని 93 స్వయం సహాయక సంఘాల వారు ఈ బ్యాంకు ద్వారా లావాదేవీలు జరుపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే ఖాతాదారులు బ్యాంకు ద్వారా నగదు జమ, విత్‌డ్రా వంటి లావాదేవీలు జరిపినపుడు సంబంధిత పాస్ పుస్తకాల్లో ఎంట్రీలను ఎప్పటికపుడు సిబ్బంది నమోదుచేసి ఉంటే ఇటువంటి వాటికి ఆస్కారం ఉండేది కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై బ్రాంచి మేనేజర్ బీఎన్ రాజును మంగళవారం విలేకరులు కలసి ప్రశ్నించగా వివరణ ఇచ్చేందుకు నిరాకరించారు.

మహిళ అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పవన్‌ను కలిసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పిఠాపురం/గొల్లప్రోలురూరల్, జూలై 2: మహిళల అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో విచారణలు నిర్వహించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసంలో పవన్‌ను మంగళవారం రాత్రి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై పవన్ ఐజీతో మాట్లాడారు. అదృశ్యమైన బాలికలు, మహిళలు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు, అందుకు గల కారణాలు ఏమిటి, అదృశ్యాలు వెనుక ఎవరు ఉన్నారు, కారణాలు ఏమిటి తదితర అంశాలన్నింటిపై దృష్టి పెట్టాలన్నారు. కాకినాడ జిల్లాలో గతంలో జరిగిన సంఘటనలు, ప్రస్తుత పరిస్థితి గురించి ఆరా తీశారు. శాంతి భద్రతలు విఘాతం కలిగించేవారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీసుస్టేషన్లకు వచ్చే ప్రజలపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని తెలిపారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ హనుమంతరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

కొత్తపల్లి, జూలై 2: వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందినట్టు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన చొక్కా మసేను(52) అదే గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులతో మంగళవారం తెల్లవారు జామున వేటకు వెళ్లారు. సముద్రంలో వేట చేస్తుండగా కెరటాల ఉధృతికి మసేను సముద్రంలో పడి గల్లంతయ్యాడు. దీంతో సహచర మత్స్యకారులు వలలతో గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో ఒడ్డుకు చేరుకున్నారు. సాయంత్రం 4గంటల సమయంలో మసేను మృతదేహం ఒడ్డుకు కొట్టుకొని రావడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

హైడ్రామా

- అక్రమ కట్టడాలకు అండగా ద్వారంపూడి
- అధికారులపై వీరంగం.. అడ్డగోలుగా విరుచుకుపడ్డ చంద్రశేఖర్‌రెడ్డి
- అనుచరులతో దాడి.. ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు
- అధికారుల హెచ్చరికతో వెనుదిరిగిన మాజీ ఎమ్మెల్యే



అధికారులపైకి దూసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

కార్పొరేషన్(కాకినాడ), జూలై2: అధికారంలో ఉన్నప్పుడు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అక్రమాలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవారు. ఆనాడు ప్రతిపక్షపార్టీల నేతలు ధ్వజమెత్తినా, బాధితులకు ఆక్రోశించినా పట్టించుకున్నవారే లేరు. పైగా అవేమీ తనకు సంబంధం లేదన్నట్టుగా ఈ మాజీ ఎమ్మెల్యే అప్పట్లో తన నోటికి పనిచెప్పి ఎంతోమందిని దుర్భాషలతో దూషించేవారు. ఆఖరికి మీడియాను సైతం బెదిరించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇటీవల ఎన్నికల్లో ఘోరంగా ఓటమిపాలయ్యారు. పదవిపోయిందనే, ప్రజలు తిరస్కరించారనే స్పృహ చంద్రశేఖర్‌రెడ్డికి ఇప్పటికీ కలగలేదు. తానింకా అధికారంలో ఉన్నట్టుగానే అటు ప్రజలపైనా, ఇటు అధికారులపైనా వీరంగం చేస్తున్నారు. అలాంటి సంఘటన కాకినాడలో గొడారిగుంట ప్రాంతంలో మంగళవారం జరిగింది. స్థానిక రాజ్యలక్ష్మినగర్‌లో వైసీపీ కార్యకర్త, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు ఒకరు అక్రమంగా ఒక భవంతిని నిర్మించాడు. మొదటి ఫ్లోర్ వరకు అనుమతులు ఉండగా, అప్పట్లో అధికార అండతో అడ్డగోలుగా రెండో ఫ్లోర్ కూడా అధికారులను బెదిరించి నిర్మించేశారు. ఇది గమనించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డగోలుగా అనుమతులు లేకుండా నిర్మించిన రెండో ఫ్లోర్‌ను కూల్చివేయాలని నోటీసులు ఇచ్చారు. వారం రోజుల కిందటే ఈ నోటీసులు ఇచ్చినప్పటికీ సంబంధిత వైసీపీ కార్యకర్త, చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు ఇసుమంతైనా స్పందించలేదు. కనీసం అధికారులకు జవాబు కూడా ఇవ్వలేదు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం రంగంలోకి దిగి రెండో అంతస్తు కూల్చే ప్రయత్నం ప్రారంభించారు. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఇంకా అధికారంలోనే ఉన్నట్టుగా అధికారులను బెదిరించారు. భవనం వద్ద ఉన్న దిగువస్థాయి అధికారులందరినీ వెళ్లిపొమ్మని హెచ్చరించారు. భవనం పైఅంతస్తు కూల్చే పని పర్యవేక్షిస్తున్న అధికారులను నిలువరించి తన అనుచరులతో వీరంగం సృష్టించారు. అంతటితో ఆగకుండా రెండో ఫ్లోర్‌కి చేరుకుని అప్పటికే భవనాన్ని కూల్చడానికి కార్పొరేషన్ అధికారులు నియమించిన కూలీలపై మాజీ ఎమ్మెల్యే అనుచరులు దాడికి పాల్పడ్డారు. అక్కడ ఉన్న ఇటుక రాళ్లు తీసి ఇద్దరిని తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో పలువురు కూలీలకు కూడా గాయాలయ్యాయి. తప్పని పరిస్థితుల్లో అక్కడున్న కూలీలందరూ పక్క భవనంపైకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అంతటితో ఆగకుండా కింద ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు ద్వారంపూడి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇంతలో అక్కడున్న పోలీసులు ఎంత అడ్డుకుందామని ప్రయత్నించినా చంద్రశేఖర్‌రెడ్డి తన అనుచరులతో రెచ్చిపోయి ఎదురుదాడికి దిగారు. దుర్భాషలతో అధికారులను దూషించారు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్లో ప్రయత్నించారు. నిబంధన ప్రకారమే ఈ చర్యలకు దిగామని, అక్రమ నిర్మాణాలపై చర్యలను అడ్డుకోరాదంటూ ఉన్నతాధికారుల నుంచి సమాధానం రావడంతో చేసేదిలేక ద్వారంపూడి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాగా టౌన్‌ప్లానింగ్ అధికారి డీసీపీ హరిదాస్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అక్రమ నిర్మాణం విషయంలో అంతా నిబంధన ప్రకారమే జరుగుతోందని స్పష్టంచేశారు.

మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు



మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్

అమలాపురం టౌన్, జూలై 2: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్, వెబ్‌సైట్ యాప్ ద్వారా చెల్లించవచ్చని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదన్నారు. కాబట్టి వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సంస్థ వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. మొబైల్ యాప్, వెబ్ సైట్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, క్యాష్ కార్డులను కూడా వాడుకోవచ్చని పృథ్వీతేజ్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత ఆకెళ్ల యశోద

అన్నవరం, జూలై 2: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఆకెళ్ల యశోద రూ.1,00,116లు విరాళంగా దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. సూపరింటెండెంట్ స్వామీజీ ఉన్నారు.

రీజెన్సీ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

- గవర్నర్‌ను కలిసిన ఎండీ జీఎన్‌నాయుడు



గవర్నర్‌తో సీపీ రాధాకృష్ణన్‌తో మాట్లాడుతున్న రీజెన్సీ పరిశ్రమ చైర్మన్ జీఎన్ నాయుడు, ఎండీ సత్యేంద్ర ప్రసాద్

యానాం, జూలై 2: యానాంలో రీజెన్సీ పరిశ్రమకు సంబంధించి ప్రభుత్వ పరిధిలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించి పరిశ్రమను ఆదుకోవాలని రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు, ఎండీ నారా సత్యేంద్రప్రసాద్ కోరారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మంగళవారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశ్రమ ప్రగతికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని, పెండింగ్‌లో ఉన్న రీజెన్సీ సమస్యలను నూటికి నూరుశాతం పరిష్కరించేలా తోడ్పాడు అందించాలని, రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించి పరిశ్రమలను ఆదుకోవాలని జీఎన్ నాయుడు కోరారు. ముందుగా గవర్నర్ రాధకృష్ణన్‌ను రీజెన్సీ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈఅంశాలపై గవర్నర్ సానుకులంగా స్పందించారు.



ఇసుక పాలసీ ఎలా ఉంటుందో?

- ఎదురు చూస్తున్న ప్రజలు
- జిల్లాలో ఆగిపోయిన ర్యాంపులు
- జిల్లాలో ఇసుక కొరత
- కూటమి అధికారంలోకి రావడంతో పరారైన వైసీపీ ఇసుక దొంగలు
- కలెక్టర్ ఆదేశాలలో లెక్కలు కడుతున్న అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం, మళ్లీ సీఎంగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో ఇసుక వినియోగదారులు, వ్యాపారులు, బోట్స్‌మన్ సొసైటీలు ఆనందంగా ఉన్నాయి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చినపుడు చంద్రబాబు ఉచిత ఇసుక విధానం తేవడంతో భవన నిర్మాణ రంగం అభివృద్ధి చెందింది. భవన నిర్మాణ రంగం మీద ఆధారపడిన వేలాది కార్మికులు హ్యాపీగా ఉండేవారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా ఇల్లు కట్టుకోవాలంటే, ఇసుక ఇబ్బంది ఉండేది కాదు.కేవలం ఎగుమతి, రవాణా చార్జీలు పెట్టుకుంటే ఇసుక ఇంటికి వచ్చేది. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వినియోగదారుల కోణం నుంచి ప్రభుత్వం ఆలోచించలేదు. అంతా ఆదాయ మార్గంగానే ఆలోచించింది. పైగా బోట్స్‌మన్ సొసైటీలు, ఇసుక వ్యాపారు లందరినీ దెబ్బకొట్టి, కేవలం జిల్లాకు ఒకరిద్దరువ్యక్తులను పెట్టుకుని, వాళ్ల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిపిన సంగతి తెలిసిందే. జిల్లాల వారీ పెద్ద సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చినట్టు మొదట్లో ఇసుక పాలసీ ప్రకటించినా తర్వాత దానిని ప్రక్కన పడేసి, వైసీపీ పెద్దలే ఇసుక బొక్కడం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. ఓపెన్ ర్యాంపుల్లో ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర వైసీపీ నేతలు ఇసుక రంగంలోకి దిగి, బోట్స్‌మన్ సొసైటీలను తరిమేసి, వారిస్థానంలో తమ అనుచరులనుపెట్టుకుని ఇసుక డ్రెడ్జింగ్ చేయించి, దానిని వైసీపీ తరపున ఉన్న గుత్తేదార్లకు అందించేవారు. టన్నుకు రూ. 150నుంచి 200వరకూ రావడంతోపాటు బాట చార్జీలు అదనంగా వచ్చేవి. పార్కింగ్ చార్జీలు కూడా వసూలు చేసేవారు. మధ్యలో కొన్ని లారీలను లెక్కలో లేకుండా తప్పించేవారు. ర్యాంపుల వద్ద వైసీపీ తరపున వ్యక్తులు కాపాలా కాసీ, డిజిటల్ లావాదేవీలు లేకుండా, కేవలం నగదు లావాదేవీలే చేసేవారు. ఇక్కడ మరొక్క విషయం గమనించాలి. గతంలో ర్యాంపులు ఎంపిక చేయాలంటే ఇరిగేషన్, మైన్స్, భూగర్భజలశాఖ, రెవిన్యూ వంటి శాఖల అధికారులంతా పర్యటించి,అక్కడ సరిహద్దులు నిర్ణయించి, ఎంత ఇసుక తవ్వ కోవచ్చో లెక్క కట్టేవారు. దాని వివరాలను జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో చర్చించి, పర్యావరణ అనుమతులు పొం దిన తర్వాత ఇసుక తీసుకోవడానికి అనుమతి ఇచ్చేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం అవేవీ లేవు.కేవలం వాళ్లు అనుకోవడం, తవ్వే సుకోవడం, అమ్మేసుకోవడం, డబ్బు మూటలు పట్టుకుని పోవడం అంతే జరిగింది. ఏ ర్యాంపులో ఎంత ఇసుక తవ్వారో కూడా లెక్కలులేని వైనం. మైన్స్, ఇరిగేషన్ ,రెవెన్యూ, సెబ్, పోలీసు, భూగర్భజలశాఖ, అటవీ, సంబంధిత శాఖలన్నీ నిర్వీర్యమ య్యాయి. ఇరిగేషన్, మైన్స్ అధికారుల అనుమతి లేకుండా రూ.కోట్ల ఇసుక తవ్వేశారు. నెలకు రూ.10కోట్ల వరకూ వైసీ పీ పెద్దలకు కప్పం అందేది. కొవ్వూరులో వైసీపీ పార్టీకి చెం దిన వ్యక్తి, పశ్చిమగోదావరిలో నెలకు రూ.30కోట్లు చెల్లించ డానికి ఒప్పుకుని, అప్పుల పాలై, రైలుపట్టాల కింద తలపెట్టి బలవన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఇలా ఇసుక దోపి డీకి మారుపేరుగా మారిపోయింది. పూర్వం నుంచి ఇసుక తీత మీద ఆధారపడి జీవనం పొందుతున్న బోట్సుమన్ సొసైటీలను మూలకు నెట్టేసి, అక్రమంగా డ్రెడ్జింగ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం-జనసేన- బిజెపి కూటమి అఖండ విజయం సాధించడంతో పాటు వైసీపీ జిల్లాలో మచ్చుకు కూడా కనిపించకుండా పోయిన సంగతి తెలిసిందే. ఈనేపధ్యంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక విధానం తెస్తానని ఆయన ప్రకటించిన సంగతి తెలిసిందే. అన్నివర్గాలు ఆనందించాయి. భవన నిర్మాణ రంగం, సొంతంగా ఇల్లు కట్టుకునేవారు, అన్నివర్గాలు ఆనందంగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఇసుక ర్యాంపులన్నీ ఆగిపోయాయి. దీనితో ఇసుక కొరత ఏర్పడవచ్చు. ఈ నేపథ్యంలో మంగళవారంరాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక విధానం మీద చర్చినట్టు సమాచారం. త్వరలోనే కొత్త ఇసుక విధానం రాబోతుంది.

ఇసుక నిల్వలు అంచనా

ఇంతవరకూ వైసీపీ గూండాగిరికి బెదిరిపోయి, వాళ్లు చెప్పినట్టు వ్యవహరించిన అధికారులు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చట్టప్రకారం నడుచుకుంటామని చెబుతున్నారు. జిల్లాకు కొత్త కలెక్టర్‌గా చేరిన పి.ప్రశాంతి కూడా గట్టిగా ఉంటూ, ఈ అధికార్లను పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో వైసీపీలో కనీసం చట్టం, నిబంధనలు అనే మాట ఎత్తని అధికారులు, చంద్రబాబు సీఎంగానే అందరూ చట్టం జపం చేస్తున్నారు. ఇసుక ర్యాంపులలోకి వెళ్లి, యంత్రా లను సీజ్ చేస్తున్నారు. అంతేకాదు. ప్రస్తుతం జిల్లాలో స్టాక్ పాయింట్లలోనూ, గోదావరి ర్యాంపులలోనూ ఉన్న ఇసుక ఎ న్ని టన్నులు ఉంటుందనే అంచనా వేయడం మొదలు పెట్టారు. సోమవారం లాలాచెరువు, కడియపులంక, కాతేరు వంటి ప్రాంతాలలో లెక్కలువేయగా, మంగళవారం పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో పర్యటించి లెక్కలు కట్టడం మొదలుపెట్టారు. బుధవారంనాటికి జిల్లాలో ప్రస్తుతం ఎంత ఇసుక నిల్వలు ఉన్నాయనేది స్పష్టత రానుంది.

● జిల్లాలో ర్యాంపుల వివరాలు

జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి. కడియం మండలంలో వేమగిరి-కడియంపులంక (బుర్రిలంక), సీతానగరంమండలంలోని వంగలపూడి-1, వంగలపూడి-2, ములకలంక, కాటవరం,పెరవలి మండలంలో ముక్కామల-2, కాకరపర్రు-1, మల్లేశ్వరం, తీపర్రు-2, తీపర్రు-3, పెండ్యాల, కానూరు ర్యాంపులు ఉన్నాయి. నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట, చిడిపి ర్యాంపులు, కొవ్వూరులో కుమారదేవం-1, కుమారదేవం-2, కుమారదేవం-3, తాళ్లపూడి మండలంలో వేగేశ్వరం ర్యాంపులు ఉన్నాయి. ఇక అఖండ గోదావరి కుడి ఏటిగట్టు వాడపల్లి, ఔరంగాబాద్, ఔరంగాబాద్-2, ఎరినమ్మ, కొవ్వూరు, దొండ గుంట రేవు, అరికిరేవుల-1,2, తాళ్లపూడి, ప్రక్కిలంకతో పాటు మొత్తం 10 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. 33 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. అఖండగోదావరి ఎడమ ఏటిగట్టువైపు మొత్తం 28 డీసిల్టేషన్ ర్యాంపులు. గాయత్రీ -1నుంచి 8, కోటి లి ంగాల 1,3,4,5, కాతేరు 1నుంచి 15ర్యాంపులు, వెంకటనగరం ర్యాంపులు ఉన్నాయి. మొత్తం 97బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి.

‘విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి’

గండేపల్లి, జూలై 2: ఈనెల 4న విద్యార్థి సంఘాలు(ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ(వి), పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్) చేపట్టిన దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని గండేపల్లి ఎంఈవోకు మంగళవారం పలువురు వినతి పత్రం అందించారు. పీడీఎస్‌యూ విజృంభన జిల్లా ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు బంద్‌కు సహకరించాలని కోరారు. పీడీఎస్‌యు(వి) నాయకులు శ్రీకాంత్ ఉన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

గ్రామాల్లో 99శాతం పింఛన్ల పంపిణీ

కరప, జూలై 2: మండల గ్రామాల్లో మంగళవారం సాయంత్రానికి 99శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలవ్యాప్తంగా 11,573 మంది లబ్ధిదారులుండగా వారిలో 11,452 మందికి (98.95శాతం) పింఛన్లను అందించామన్నారు. 180మంది సిబ్బంది మరో 180మంది సహచర సిబ్బందిని నియమించి 2 రోజుల్లో పూర్తిస్థాయిలో పింఛన్ల సొమ్మును బట్వాడా చేశామన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, మీడియా కో-ఆర్డినేటర్ తుమ్మలపల్లి నాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలో మంగళవారం సాయంత్రానికి 99శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని కొత్తపల్లి ఎంపీడీవో పి.వెంకటనారాయణ తెలిపారు. పింఛన్ల పంపిణీలో సర్వర్ల మొరాయింపు తప్ప ఏ ఇబ్బందులు లేవని ఆయన చెప్పారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



గొల్లప్రోలు రూరల్: చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన తంగెళ్ల మహాలక్ష్మి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నది. మంగళవారం చెందుర్తి పంచాయతీ కార్యదర్శి దత్తు అక్కడకు వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు.

అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం : డీసీపీ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 2: నగరంలో అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతామని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ డీసీపీ హరిదాస్ ప్రకటించారు. దీనికి ప్రజలంతా సహకరించాలని, అక్రమ కట్టడాలను నిలువరించి నిబంధన ప్రకారం ఉండేటట్టు చూడాలని కోరారు. నగరంలో కొంతమంది అడ్డగోలుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేశారని వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తమకు రాజకీయపరమైన ఒత్తిడులు ఏమీలేవని అధికారిక నిబంధనల ప్రకారం టౌన్‌ప్లానింగ్ నడుచుకుంటుందన్నారు. ఇంకా నగరంలో ఇలాంటి అక్రమాలు ఎన్ని జరిగిన వాటన్నిటిని టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రానున్న కాలంలో మరిన్ని అక్రమ కట్టడాలకు నోటీసులు ఇస్తామని నిబంధన ప్రకారమే ముందుకు నడుచుకుంటామని, దీనికి ప్రజల సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు అందించడమే టౌన్‌ప్లానింగ్ లక్ష్యమని చెప్పారు. గుడారిగుంట అక్రమ కట్టడం కూల్చివేతకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

‘అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి’

కరప, జూలై 2: అతిసార పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాలల స్వస్తిక్ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రభాకర్ సూచించారు. యాంటీ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన వేములవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్‌వాడీ కార్యకర్తలకు, చిన్నారుల తల్లిదండ్రులకు పలు సూచనలు జారీచేశారు. కలుషిత నీటిని, చల్లారిన ఆహారపదార్థాలను తీసుకోవద్దని, ప్రతీఒక్కరికీ విధిగా ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎంకే సౌజన్య అతిసార నిరోధానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎంపీహెచ్‌ఈవో కె.గోవిందరావు, ఎంపీహెచ్‌ఎస్ రమణారావు, ఎంఎస్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం లావణ్య, ఎంపీహెచ్‌వో రమణమూర్తి తదితరులు ఉన్నారు.

జీజీహెచ్ కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాలపై విచారణ

జీజీహెచ్ (కాకినాడ), జూలై 2: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో మంగళవారం కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాల చెల్లింపు ఇతర సమస్యలపై ఏలూరు జాయింట్ లేబర్ కమిషనర్ విచారణ చేపట్టారు. శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డ్స్, డైట్ సెక్షన్ వర్కర్లు తదితర కార్మికులతో మాట్లాడారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో కార్మికుల పీఎఫ్ విషయంలో యాజమానులు చెల్లించాల్సిన వాటా కూడా కార్మికుల జీతాల్లో నుంచే మినహాయిస్తున్నారని ఈ విషయమై న్యాయం చేయాలన్నారు. ప్రతీ నెలా 5లోపు ఏనాడు జీతాలు చెల్లించలేదన్నారు. డైట్ విభాగంలో కూడా కాంట్రాక్టర్ జీతం బ్యాంకులో డిపాజిట్ చేయడం లేదని, పీఎఫ్ చెల్లింపులు జరగలేదన్నారు. జాయింట్ కమిషనర్ స్థాయి అధికారి జీజీహెచ్‌లో కార్మికుల సమస్యలు విచారించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఏసీఎల్ బుల్లిరాణి, ఏఎల్‌వోలు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డవారికి జైలు శిక్ష

కాకినాడ క్రైం, జూలై 2: పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుల్లో ఒకరికి 2 రోజుల జైలు శిక్ష, నలుగురికి తలో రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్టు ట్రాఫిక్ సీఐలు తెలిపారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతున్న ఐదుగురు వాహనదారులను గుర్తించి, కాకినాడ నాలుగవ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. ఇందులో ఓ వాహనదారుడికి 2 రోజుల జైలు శిక్ష, మిగతా నలుగురికి తలో రూ.10 వేలు జరిమానా విధించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఏలేశ్వరం, జూలై 2: ఏలేశ్వరంప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. డిగ్రీ తృతీయ సంవత్సరం పూర్తి చేసి ఉన్నత విద్యకై కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ప్రవేశ పరీక్షల్లో దొమ్మేటి విజయకుమార్ 113 స్కోర్‌తో వేరళ కేంద్ర విశ్వవిద్యాలయం నందు రశాయన శాస్త్ర విభాగంలో ఏపీపీజీసీఈటీ నందు, గణిత శాస్త్రంలో జొన్నాడ నాగసత్యవేణి 20వ ర్యాంకు, జంతు శాస్త్రంలో ముంజరపు మౌనిక 315వ ర్యాంకు, రసాయన శాస్త్రంలో మాతూరి సూర్య 112వ ర్యాంకు, రాజనీతి శాస్త్రంలో మూస దావీదురాజ్ 443వ ర్యాంకు, ఐసెట్‌లో షేక్ బేబి పాతిమ 32136వ ర్యాంకు సాధించి ఆయా యూనివర్సిటీల్లో ప్రవేశం పొందారని ప్రిన్సిపాల్ డి.సునీత పేర్కొని వారిని అభినందించారు. అధ్యాపకులు ప్రయాగమూర్తి, బంగార్రాజు, చెన్నారావు, వెంకటేశ్వరరావు, మదీన, ప్రసాద్, సురేష్, రామారావు, మేరి, పుష్ప పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శంఖవరం, జూలై 2: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి ఇద్దరిపై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శంఖవరంలో షాపునెంబరు 1,3లలో తనిఖీలు నిర్వహించి అక్రమ నిల్వలు గుర్తించారు. దుకాణందారులు పర్వత సత్యనారాయణమూర్తి, పడాల దేవిలపై 6ఏ కేసులు నమోదు చేసి జాయింట్ కలెక్టరు కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. షాపు నెంబరు 1లో 9240, 3లో 23 బ్యాగులు అక్రమ నిల్వలు గుర్తించామని తెలిపారు. రౌతులపూడి మండలం పి.చామవరంలో కూడా దాడులు నిర్వహించామని అక్కడ ఏ తేడాలు గమనించలేదని తెలిపారు. ఎస్‌ఐ జగన్నాథరెడ్డి, ఏజి లక్ష్మీనారాయణ, ఏవో భార్గవ్, ఎమ్ఎస్‌వో రామస్వామి తదితరులు ఈదాడులలో పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో తొలి ఆపరేషన్

పిఠాపురం, జూలై 2: ఉన్న తక్కువ సదుపాయాలతోనే పట్టణంలోని మంగాయమ్మరావుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో వైద్యుడు ఆపరేషన్ చేశారు. ఇది ఇక్కడ తొలిఆపరేషన్ కావడం విశేషం. కాకినాడకు చెందిన ఎస్.పాప(45) కాలిపై కణితితో బాధపడుతూ యూపీహెచ్‌సీకి వచ్చింది. ఆమెకు డాక్టర్ యాళ్ల ఆనంద్ పరీక్ష చేసి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఆసుపత్రిలో సదుపాయాలనే వినియోగించుకుని సిబ్బంది సహకారంతో ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు. తొలి ఆపరేషన్‌ను చేసిన వైద్యుడు, సహకరించిన సిబ్బందిని పలువురు అభినందించారు.

బాల్య వివాహాలపై అవగాహన



కిర్లంపూడి, జూలై 2: బాల్య వివాహాలు, అతిసారంపై మంగళవారం కిర్లంపూడిలో కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు జగ్గంపేట సీడీపీవో ఎం.పూర్ణిమ, ఎంఈవోలు టి.జోసెఫ్, ఎం.చిన్న మాట్లాడుతూ బాలికలను చదివించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. అంతేకాని బాల్య వివాహాలు చేసి జీవితం ఇబ్బందుల్లో నెట్టరాదని అలా చేస్తే శిక్ష అనుభవించకతప్పదన్నారు. అతి సారం వ్యాధిపై తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బూసమ్మ, జి.సునీత, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో సినీ ఆర్ట్ డైరెక్టర్ పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం ఆనందసాయి

అన్నవరం, జూలై 2: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారి గంటా విష్ణు ఉన్నారు.

పవన్ నివాసం వద్ద కోలాహలం

వినతులు ఇచ్చేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు





పవన్‌కు వినతి అందజేస్తున్న మీ సేవా కేంద్రాల నిర్వాహకులు, పవన్ నివాసం వద్ద వివిధ వర్గాల ప్రజలు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, జూలై 2: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నివాసం వద్ద మంగళవారం కోలాహలం నెలకొంది. పవన్‌ను కలిసేందుకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు తరలివచ్చారు. తమ సమస్యలపై విన్నవించుకునేందుకు ఎన్టీఆర్ వైద్యాలయం పారిశుధ్య కార్మికులతో పాటు వివిధ వరాల ప్రజలు వచ్చారు. వారంతా పవన్ కోసం ఎదురుచూసి నివాసం వద్ద వినతులు స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద తమ వినతులను అందజేసి వెనుతిరిగారు. అదే విధంగా జిల్లాలో ఉన్న చంద్రన్న భీమా మిత్రలు పవన్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చారు. ఉదయం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నేత కదారి తమ్మయ్యనాయుడు సహా పలువురు పవన్‌ను కలిశారు. పవన్ నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరావు తన కుటుంబసభ్యులతో కలిసి పవన్‌కల్యాణ్‌ను సత్కరించి ఫోటోలతో ఉన్న జ్ఞాపికను అందజేశారు. 2023 గ్రూప్-1 పరీక్షలకు హాజరైన అభ్యర్థులు తమ డిమాండ్లపై పవన్ కార్యాలయ ప్రతినిధులకు వినతి పత్రం అందజేశారు. మీసేవా కేంద్రాల ద్వారా గతంలో ఉన్న సర్వీసులు అన్నింటిని పునరుద్ధరించాలని కేంద్రాల నిర్వాహకులు(ఆపరేటర్లు) చేబ్రోలులోని నివాసంలో పవన్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మీసేవా ఆపరేటర్లు రాజు, శర్మ, మూర్తి, శివ, నాగబాబు, వెంకటేశ్వరరావు, కృష్ణ, కిషోర్, రాజశేఖర్, గాంధీ, మహాలక్ష్మి, శేఖర్, నాగు, సూరిబాబు తదితరులు ఉన్నారు.

న్యాయం చేయాలని వినతులు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 2: కాకినాడ సత్యప్రసన్ననగర్‌లో ఉన్న భాస్కర్ ఎస్టేట్స్ (అపార్ట్‌మెంట్) కృంగిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయామని అపార్ట్‌మెంట్‌వాసులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వద్ద మొరపెట్టుకున్నారు. దీన్ని నిర్మించిన కాంట్రాక్టర్ వల్ల తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపి, రామకృష్ణ పాల్గొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో టీఏ, డీఈవో, హెల్పర్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు కోరారు. ఈమేరకు కాకినాడ కలెక్టరేట్ వద్ద డిప్యూటీ సీఎం పవన్‌కు వినతి అందించారు. గ్రామ సచివాలయంలో సర్వేయర్లను నియమించడం వల్ల మండలాల్లో పనిచేస్తున్న లైసెన్సు సర్వేయర్లు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కాకినాడ కలెక్టరేట్‌లో పవన్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ లైసెన్సుడ్ సర్వయర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు వివరించిన ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు, జూలై 2: నియోజకవర్గంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటిసరఫరా తదితర సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తీసుకెళ్లారు. మంగళవారం కాకినాడలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె పవన్‌కు సమస్యలు వివరించగా అధ్యయనం చేసి పరిశీలిస్తామని తెలిపారు.

జగ్గంపేట: కాకినాడలో జరిగిన పవన్ సమీక్షలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియోజకవర్గంలో ఇరిగేషన్ సమస్యలను వివరించారు. ముఖ్యంగా తాళ్ళూరు లిఫ్ట్ మరమ్మతులు పూర్తిస్థాయిలో చేసి మెట్ట ప్రాంత రైతులను ఆదుకోవాలని, అధ్వాన్నంగా ఉన్న రోడ్లన్నీ పూర్తి చేయించాలని పవన్‌ను కోరారు. ఏలేరు ఆధునీకరణపై చర్చించుకున్నారు.



ప్రత్తిపాడు: పవన్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



జగ్గంపేట: పవన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

ప్రజా శ్రేయస్సుకే కూటమి ప్రభుత్వం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 2: రాష్ట్రాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. మంగళవారం రమణయ్యపేట నుంచి తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి గుడికి సైకిల్‌పై వెళుతోన్న జనసైనికుడు నరాల శ్రీనివాస్ సైకిల్ యాత్రను నానాజీ జెండా ఊపి ప్రారంభించారు. నానాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, పిఠాపురంలో జనసేనాధిపతి పవన్ కల్యాణ్, కాకినాడ రూరల్ నుంచి తాను ఘనవిజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీనివాస్ సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కులమతాలకతీతంగా ప్రజలంతా ఏకపక్షంగా కూటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించారని, ప్రజల ఆశలను నూటికి నూరు శాతం నెరవేర్చేలా కూటమి నాయకులతో కలసి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ కో ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు తదితరులు ఉన్నారు.

తాళ్లరేవులో వాటరు ప్లాంటు సీజ్



వాటరు ప్లాంటును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారి

తాళ్లరేవు, జూలై 2: 216 జాతీయ రహదారి పక్కన గుండాబత్తుల వారి నాన్‌లేవుట్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సత్యశ్రీ వాటర్ ప్లాంటును స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం తూర్పుగోదావరిజిల్లా ఫుడ్ సేఫ్టీ సహాయక ఆహార నియంత్రణాధికారి బి.శ్రీనివాస్, ఫుడ్‌సేఫ్టీ అధికారి సుబ్బారావు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాటరు ప్లాంటును తనిఖీ చేశారు. ప్లాంటులో ఏ పరీక్షలు నిర్వహించకుండా నకిలీ స్టిక్కర్లతో మంచినీటి బాటిళ్లను విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వాటరు మిషనరీలు, వాటరు ట్యాంకులను సీజ్ చేశారు. రూ.14వేలు విలువచేసే బాటిల్స్, ప్యాకెట్లను గుర్తించి సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. శాంపిల్స్‌ను వెంట తీసుకుని వెళ్లి ప్లాంటు నిర్వాహకుడు బోనగిరి రాజేష్‌పై క్రిమినల్, 6ఏ కేసులు నమోదు చేసి కలెక్టర్‌కు నివేదించనున్నట్టు తెలిపారు. స్థానిక రెవెన్యూ ఇనస్పెక్టర్ రవితేజ వాటరుషెడ్డుకు సీల్ వేసి సీజ్ చేశారు. వీఆర్వో వీరబాబు, పంచాయతీ కార్యదర్శి శంకరనారాయణ ఉన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు

ప్రత్తిపాడు, జూలై 2: మండలంలో టి.రాయవరం రహదారి అధ్వానంగా మారింది. ప్రత్తిపాడుకు 3కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రహదారి దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా మట్టి రహదారిగానే కొనసాగుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారి వాహనాలు ప్రయాణించేందుకు వీలు లేకుండా ఉంది. అగాధాలు వంటి గోతులతో ధ్వంసమైన ఈ రహదారిలో టి. రాయవరం గ్రామస్థులు, ప్రత్తిపాడు హైస్కూల్, కళాశాలలకు వచ్చే విద్యార్థులు, స్థానికులు నరకయాతన పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు, పాలకులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని రాయవరం ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న టి.రాయవరం రహదారి

కూటమి ఐక్యతతో రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు




నాయకులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

సామర్లకోట, జూలై 2: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ఐక్యత రానున్న కాలంలో రాష్ట్రాభివృద్ధికి దోహదపడగలదని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు పేర్కొన్నారు. సామర్లకోటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు నందు పెద్దాపురం నియోజకవర్గ కూటమి విజయోత్సవ వేదిక మంగళవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు కొర్లమండ వీరభద్రరావు, కొర్లమండ శ్రీవాణీ న్యాయవాదుల దంపతులు, బడుగు శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా రాజప్ప మాట్లాడుతూ కూటమి ఐక్యతతో సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని సాధించామని, ఇదే స్ఫూర్తితో రానున్న కాలంలో కూటమి మరింత బలోపేతం దిశగా నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో వ్యవహరించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీలు, వర్గాలకతీతంగా తాను చేపట్టే ప్రతీ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సహకరించాలన్నారు. విబేధాలకు తావులేకుండా నియోజకవర్గాన్ని ముందుకు నడిపించాలన్నారు. తుమ్మల బాబు మాట్లాడుతూ కూటమి ఐక్యతతో ముందుకు వెళితే రానున్న కాలంలో మరే పార్టీలూ దరిచేరవని చెప్పారు. బీజేపీ ఇన్‌చార్జి వి.వి.రమణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు మాట్లాడారు. చినరాజప్ప, తుమ్మల బాబు, రమణలను ఘనంగా సన్మానించి శాలువాలు కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు న్యాయవాది దంపతులు వీరభద్రరావు, శ్రీవాణీ, శ్రీకాంత్‌లను కూటమి నాయకులు సన్మానించారు. బూత్ లెవల్ నాయకులను సత్కరించి జ్ఞాపికలందజేశారు. కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, జనసేన నాయకుడు అత్తి సత్యనారాయణ ఉన్నారు.

‘పర్యావరణ పరిరక్షణే ధ్యేయం’

‘అమ్మ పేరుతో మొక్క’ కార్యక్రమాలు



ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న బీజేపీ శ్రేణులు

ఏలేశ్వరం, జూలై 2: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. మంగళవారం అమ్మ పేరుతో మొక్క నాటుదాం కార్యక్రమాన్ని ఏలేశ్వరంలో ప్రోగ్రాం ఇన్‌చార్జ్ పైల సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో చేపట్టి బీజేపీ శ్రేణులు మొక్కలు నాటారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, పైల అయ్యప్ప, సిపరపు సత్తిబాబు, ముచ్చి అప్పలరాజు, కొల్లిపర సురేంద్ర, రెడ్డి రాజు, భజంతుల మణి, వాగు రమేష్, సత్యనారాయణ గొల్లపూడి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊట వీరబాబు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం దుర్గమ్మ గుడి ఎదురుగా ఉన్న పార్కు వద్ద అమ్మ పేరుతో మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్రి ధర్మరాజు, కించు జోగిరాజు, ఇంటి నాగేశ్వరరావు, వెలుగూరి హరేరాం, వి.వీరబాబు, రామకుర్తి సూర్యనారాయణ, బొల్లు విజయ్‌కుమార్ సిద్ధపురెడ్డి చంద్రరావు, నక్కా శ్రీనివాస్, సిద్దా శివ, ఆర్ఎస్ఎస్ నాయకులు దొడ్డిపట్ల సోమన్నదొర, చుక్కల సత్యనారాయణ ఉన్నారు.

రౌతులపూడి: జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ రౌతులపూడిలో హైస్కూల్ నందు అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ పైల సుభాష్ చంద్రబోస్, బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా నాగశ్రీను, ఉమ్మిడి వెంకటేశ్వరరావు, యాదగిరి వెంకటరమణ, ఎనుముల రాజా, చిట్రా పాపారావు, బర్ల చిట్టిబాబు, కురాకుల రాజా ఉన్నారు.

కరప: నడకుదురు, గురజనాపల్లి గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, పార్టీ మీడియా కో-ఆర్డినేటర్ తుమ్మలపల్లి నారాయణ రావు(నాని)తో కలిసి పలు మొక్కలు నాటి నీళ్లు పోశారు. నాయకులు పుట్టా వీరప్రసాద్‌గాంధీ, రొంగలి సన్యాసిరావు, కింతాడ శివ పాల్గొన్నారు.

కార్పొరేషన్: బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏడిద కృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ ఈస్ట్ మండలాధ్యక్షుడు గాలిదేవర శేఖర్ అధ్యక్షతన, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాచర్ల రవి ఆరవ డివిజన్ రేచర్లపేట కలర్ పాకల స్ట్రీట్ రైతు బజార్ పార్టీ జెండా దగ్గర తల్లి పేరు మీద మొక్క నాటారు. ప్రధాని మోదీ తల్లి పేరు మీద కోటి మొక్కలు నాటడంపై హర్షంవ్యక్తం చేశారు.



కరప: నడకుదురులో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

‘ప్రభుత్వం బాధితులకు అండగా నిలవాలి’

కాకినాడ సిటీ, జులై 2: నూతన ప్రభుత్వం బాధితులకు అండగా నిలిచి నిందితులను కఠినంగా శిక్షించాలని, తోట త్రిమూర్తులు బెయిల్ రద్దు చేసినందున న్యాయస్థానం తీర్పును పునర్విచారణ చేయాలని సీనియర్ దళిత నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు కోరారు. శిరోముండనం తీర్పుపై సదస్సు, భవిష్యత్తు కార్యచరణ పేరుతో స్థానిక యూటీఎఫ్ హోంలో మంగళవారం దళిత ప్రజాసంఘాల నాయకులు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్ష వర్గంగా ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తంతాడి కిరణ్, ఐఎఫ్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు వ్యవహరించారు. సుమారు 28ఏళ్లు పోరాటం చేసిన శిరోముండనం బాధితులను సత్కరించారు. మరోసారి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణ ప్రకటించాలని నిర్ణయించారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చంగల్‌రావు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, దళిత సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బచ్చల కామేశ్వరరావు, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి మనోహర్, సీపీఎం పార్టీ జిల్లా నాకుడు కె.శ్రీనివాస్, దళిత ఐక్య పోరాట వేదిక కోకన్వీనర్ రేవునాగేశ్వరరావు పాల్గొన్నారు.



అంబేద్కర్, పూలే చిత్రపటాలకు నాయకుల నివాళి

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



రాణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జూలై 2: క్రీడాకారులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని నెహ్రూనగర్‌కు చెందిన కాబిరేగుల రాణి కిగ్‌బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచి స్టేట్ ఫస్ట్ గోల్డ్ మెడల్ సాధించడంలో ఎమ్మెల్యే అభినందించారు. లక్ష్య సాధనలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, జనసేన నాయకులు శివ, వాడపల్లి రాము తదితరులున్నారు.

హోంమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే దంపతులు



సర్పవరం జంక్షన్, జూలై 2: కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులు మంగళవారం పాయకరావుపేటలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన కార్యకర్తలను గుర్తించాలని, మహిళల భద్రత, రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

చొల్లంగిలో నేత్రదానం

తాళ్లరేవు, జూలై 2: చొల్లంగి గ్రామం ఇందిరమ్మకాలనీకి చెందిన పిల్లి వినయ్‌కుమార్ (17) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు వినయ్‌కుమార్ నేత్రాలను దానం చేశారు. వారిని టీడీపీ ప్రధానకార్యదర్శి కట్టా త్రిమూర్తులు, ఎంపీటీసీ గర్రే సాయిలక్ష్మి, లక్ష్మీనారాయణ అభినందించారు.

‘ఉపాధి పనులు కల్పించాలి’

రౌతులపూడి, జూలై 2: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, టీడీపీ నేత పసగడుల రమణ అన్నారు. మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పనులను వారు ప్రారంభించారు. గతం ప్రభుత్వం పనులు చెప్పకుండా మస్తర్లు వేసుకుని సొమ్ములు దోచుకుందని, టీడీపీ ప్రభుత్వం ప్రతీ ఒక్కరికి పని కల్పిస్తుందని వారు పేర్కొన్నారు.

పాదాలమ్మ పండుగ

రౌతులపూడి, జూలై 2: బలరామపురంలో పాదాలమ్మ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామ శివారు ఉన్న అమ్మవారి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. మాజీ సర్పంచ్ పైల పైడిరాజు, ఎంపీటీసీ సోమరౌతు రవి, కోరుప్రోలు సత్తిబాబు పాల్గొన్నారు.

వనమహోత్సవ వారోత్సవాలు

గండేపల్లి, జూలై 2: మండలంలోని సూరంపాలెం ఆదిత్య డిగ్రీ,పీజీ కళాశాలలో వనమహోత్సవ వారోత్సవాల్లో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కల సస్యరక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడం, మొక్కలు శుభ్రపరచడం, పాదులు కట్టడం వంటి పనులు చేపట్టారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ అభినందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టీకె.విద్యాసాగర్ పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు

సామర్లకోట, జూలై 2: జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు మంగళవారం సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్ పరిశ్రమ ఆవరణలో నిర్వహించారు. సంస్థ హెచ్ఆర్‌డీ టీ.నీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకల్లో ముఖ్య అతిథిగా ప్రాంతీయ విద్యుత్ అధికారి హెచ్.శాంతారావు హాజరయ్యారు. సంస్థలో ఏ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మెళకువలు పాటించిన శ్రీనుబాబుని అభినందించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. వినోద పైక వాసుదేవ, చెల్లదురై, పీఆర్వో వీజీకుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

జగ్గంపేట, జూలై 2: జగ్గంపేటకు చెందిన జేవీఆర్ గ్రూప్స్ అధినేత జీనుమణిబాబు, బాలాజీ లాడ్జ్, బాలాజీ రెస్టారెంట్ అధినేత దివంగత సిరపు రాజశేఖర్ రెడ్డి, వారి సోదరుడు బాలురెడ్డి, రాజశేఖర్ రెడ్డి మిత్రబృందం రాజశేఖర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టిభద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లిమూర్తి, అనుకుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

సామర్లకోట, జూలై 2: సామర్లకోట మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాలు నందు జరగనున్నట్టు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తెలిపారు. ఎంపీపీ బి.సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో మండలంలో పలు గ్రామాల అభివృద్ధి పనులకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించనున్నందున అందరూ సభ్యులు సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

‘పీఆర్’లో ప్రవేశాలకు దరఖాస్తులు

కాకినాడ రూరల్, జూలై 2: ఏపీఎస్సీహెచ్ఈ ఆదేశాల మేరకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి వివిధ కోర్సులలో ప్రవేశాలకోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం తెలిపారు. కళాశాలలో ప్రస్తుతమున్న 30 కోర్సులతో పాటూ నూతనంగా బీబీఏ హెల్త్‌కేర్‌మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

గార్డెనింగ్ సుందరీకరణకు నాణ్యతలేని మెటీరియల్



నాసిరకం సిమెంట్ ఇటుకలు

జేఎన్టీయూకే, జూలై 2: కాకినాడ జేఎన్టీయూకేలో కొన్ని నెలలుగా కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైన నిర్మాణాలు వంటి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అంతే కాకుండా వైసీపీకి చెందిన గ్రీన్‌కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో వర్సిటీలో గార్డెనింగ్ సుందరీకరణ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చింది. అయితే వర్సిటీలోని లాన్‌ను ఎత్తుచేసేందుకు నాసిరకం సిమెంట్ ఇటుకలు, ఇతర మెటీరియల్‌ను ఉపయోగిస్తున్నారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టే పనుల్లోనే ఈవిధమైన నాసిరకం మెటీరియల్ వాడి నాణ్యతకు తిలోదకాలిస్తుంటే వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.